ఎక్కడబడితే అక్కడే...

- విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు
- జనావాసాల మధ్యే ఏర్పాటు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు



జొన్నవలసలో మద్యం షాపు ఎదురుగా ఏర్పాటైన బెల్ట్ షాపులు



దుప్పాడ గ్రామ కాలనీలో ఉన్న బెల్ట్ షాపులో మద్యంబాబులు

విజయనగరం రూరల్: బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల చేసిన ప్రకటన సంబంధిత ఎక్సైజ్ శాఖాధికారులకు పట్టనట్లుగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా.. ఎక్కడబడితే అక్కడ ఏర్పాటవుతున్నా అధికారుల్లో చలనం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపుల హవా జోరుగా కొనసాగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే ఊరుకోవద్దని చెబుతున్నప్పటికీ గ్రామాల్లో యథేచ్ఛగా కొనసాగడం విశేషం. మండలంలోని జొన్నవలస, ద్వారపూడి, సుంకరిపేట గ్రామాలలో మద్యం షాపులున్నాయి. అయితే ఈ షాపుల పరిధిలో ఉన్న గ్రామాలతో పాటు మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. అదికూడా జనావాసాల మధ్య ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దుప్పాడ గ్రామ కాలనీలో ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపులో వేకువజాము నుంచే విక్రయాలు జరుగుతుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. అలాగే జొన్నవలస మద్యం షాపు ఎదురుగానే కొన్ని షాపులు ఏర్పాటుయ్యాయి. అందులో ఉదయాన్నే మద్యం లభించడంతో పాటు మందుబాబులు అక్కడే తాగేందుకు వీలుగా గ్లాసులు, సోడాలు, డ్రింక్‌లు, తినుబండారాలు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే జొన్నవలసలో ఉన్న ఓ దాబాలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేపడుతున్నారని స్థానిక యువత చెబుతోంది. మలిచెర్ల, గుంకలాం, కొండకరకాం, కోరుకొండ, పినవేమలి వంటి గ్రామాలలో కూడా బెల్ట్‌షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. మండల వ్యాప్తంగా మూడుచోట్ల మద్యం షాపులు ఉండగా అనధికారకంగా పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ గోవింద



మద్యంతో పట్టుబడిన వ్యక్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. వివిధ గ్రామాలలో మద్యం అమ్ముతూ పట్టుబడిన వ్యక్తులను ఎక్సైజ్ శాఖాధికారులు సోమవారం స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, మొదటి తప్పుగా భావించి ఈసారి విడిచిపెడుతున్నామని, భవిష్యత్‌లో మరోసారి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు వై . చంద్రమోహన్, ఎస్. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

డెంకాడ: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి కె. శోభన్‌బాబు తెలిపారు. పెదతాడివాడలో సోమవారం జరిగిన ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా టి.స్వామినాయుడు, అధ్యక్షుడిగా టి.స్వామినాయుడు, కోశాధికారిగా కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఫెడరేషన్ బలోపేతానికి కృషి చేస్తామని ప్రధాన కార్యదర్శి శోభన్‌బాబు తెలిపారు.

అద్దె బకాయిలపై ఉపేక్షించేది లేదు..



దుకాణాన్ని సీజ్ చేస్తున్న సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ అధీనంలోఉన్న దుకాణాలకు సంబంధించి దీర్ఘకాలిక అద్దె బకాయిలపై ఉపేక్షించేది లేదని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో గల దుకాణాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు సోమవారం అద్దె వసూలు చేశారు. అద్దె చెల్లించని వారి దుకాణాలను సీజ్ చేశారు. మూడు నెలలు కన్నా ఎక్కువ మొత్తంలోఅద్దె బకాయిలుంటే ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, అప్పటికీ స్పందించకపోతే దుకాణాలు సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రసాద్, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతతో రోగాలు మాయం



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఉప కార్య నిర్వహణాధికారి వెంకటరావు, తదితరులు

డెంకాడ: పరిసరాల పరిశుభ్రతతో రోగాలను నివారించవచ్చని జెడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరావు అన్నారు. మండలంలోని గుణుపూరు గ్రామంలో జరుగుతున్న ఐహెచ్‌హెచ్‌ఎల్ సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. సర్వేలో మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించడంతో పాటు మరుగుదొడ్డి ఉన్న వారు వాటిని వినియోగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ స్థాయి అధికారులు, ఉద్యోగులకు సూచించారు. అలాగే తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉంటే ఎంత దూరం ఉన్నాయి, ఎన్ని ప్రాంతాల్లో ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి..



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మహిళా నాయకత్వాన్ని పెంపొందించాలన్నారు. శక్తి సూపర్ షి, ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమం ద్వారా మహిళలకు శిక్షణ తరగతలను ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం అర్బన్: భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ కొనియాడారు. భారత దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జాతీయ విద్యాదినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన సేవలను అంబేడ్కర్ గుర్తుచేశారు. ఆయన బోధనలు జాతికి ఆదర్శనీయమైనవిగా పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ సమతా భావంతో ముందుకు సాగడమే ఆయకు మనం పాటించే ఘననివాళిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మానారిటీ సంక్షేమాధికారి ఆర్.ఎస్.జాన్, జిల్లా ఖజానా అధికారి కుమార్, మైనారిటీ సోషల్ వర్కర్ షేక్ అబ్దుల్ కరీమ్ వాజీద్, వివిధ మతాల పెద్దలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మత పెద్దలు, సంఘ ప్రతినిధులను కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం ఫోర్ట్: స్వాతంత్ర్య సాధన కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆజాద్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి యూనివర్సిటీ గ్రాంట్స్ నిధులు విడుదలకు ఎంతో కృషి చేశారన్నారు. తొలి విద్యాశాఖా మంత్రిగా విద్యారంగాన్ని బలోపేతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ. కరీం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి శ్రీనివాస్, పార్టీ నాయకులు షరీఫ్, సమీర్, రహమాన్, కె. చంద్రశేఖర్, గంటా సత్యనారాయణ, దుర్గాప్రసాద్, రామచంద్రరాజు, డాక్టర్ గేదెల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఇనపకుర్తికి ఆర్ట్ ఆఫ్ ఏపీ బుక్‌లో స్థానం



డ్రాయింగ్ టీచర్‌ను సన్మానిస్తున్న పెద్దలు

పూసపాటిరేగ: పూసపాటిరేగ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ ఇనపకుర్తి చినసత్యనారాయణ వేసిన చిత్ర కళా వస్తువులకు 64 కళలు డాట్‌కాం..ఆర్ట్‌ఆఫ్ ఏపీ బుక్‌లో స్థానం లభించింది. ఈ నెల 10 వ తేదీన విజయవాడ భవానీపురం హరితబెరం పార్కు కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి 300 మంది యువ జాతీయ, అంతర్జాతీయ స్థాయి చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. డ్రాయింగ్ టీచర్ చిన సత్యనారాయణ బుడబుక్కలవాడు, ద్వారం వెంకటస్వామినాయుడు (సింబాలిజం), సబ్బుపై వినాయకుడు, గురజాడ అప్పారావు మొదలగు శిల్పాలు ప్రదర్శించారు. వీటిని ఆసక్తిగా తిలకించిన న్యాయనిర్ణేతలు ఈ చిత్రాలను ఎంపిక చేశారు. న్యాయనిర్ణేతగా మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ వ్యవహరించారు. డ్రాయింగ్ టీచర్‌ను పాఠశాల హెచ్‌ఎం బి.శంకరరావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు వాహనాలు సీజ్

నెల్లిమర్ల: పట్టణం మీదుగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను స్థానిక పోలీసులు సోమవారం పట్టుకుని సీజ్ చేశారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు గుర్ల నుంచి అలమండ సంతకు పశువులను తరలిస్తున్న వాహనాలను స్థానిక మిమ్స్ జంక్షన్ వద్ద ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేసి, అందులో ఉన్న 21 పశువులను విడిపించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..

విజయనగరం క్రైమ్: మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి జీవితాలను నాశనం చేయవద్దని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి అపరాధ రుసుం విధించారు. మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సర్వేకు సహకరించాలి



గొల్లపేటలో ఇంటింట సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: బహిరంగ మల,మూత్ర విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా పరిషత్ సీఈఓ బీవీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని గొర్లిపేటలో జరుగుతున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని, ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న సర్వేను అధికారులు, సిబ్బంది పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలి

గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన పరిస్థితులు, మరుగుదొడ్లు, తాగునీటి పైపులైన్ల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న సర్వేను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు సూచించారు. మండలంలోని రామతీర్థం, సీతారామునిపేట గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేలో కార్యదర్శులు, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామైక్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకొని ఈ నెల 13లోపు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జగన్నాథం, కార్యదర్శులు బంగార్రాజు, శ్రీదేవి పాల్గొన్నారు.

శివయ్యా.. ఆదుకోవయ్యా..!

కార్తీకమాసం రెండో సోమవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఓం నమఃశివాయ నామ స్మరణతో మార్మోగాయి. స్వామివారి దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం టౌన్: సింహాద్రినగర్ సాయిబాబా ఆలయంలో వైద్యనాథునికి సామూహిక అభిషేకం చేస్తున్న భక్తులు



నెల్లిమర్ల రూరల్: సతివాడ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ శివాలయం వద్ద ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



సాక్షి ఫొటోగ్రాఫర్: కంటోన్మెంట్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



సాక్షి ఫొటోగ్రాఫర్: పసుపతినాథేశ్వరస్వామి ఆలయంలో సామూహిక అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



సాక్షి ఫొటోగ్రాఫర్: స్ఫటిక లింగానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

భవన నిర్మాణాల పరిశీలన..



విజయనగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న భవన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. నగరంలోని ఉల్లివీధి ప్రాంతంలో నిర్మాణ పనులను టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అనిత ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపడితే సహించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

– విజయనగరం

అభినందనలు



నెల్లిమర్ల నగరం పంచాయతీ పరిధిలోని కేజీబీవీ విద్యార్థులను ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఉమా, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు కె. భారతి, కె. అలేఖ్య ఆదివారం నిర్వహించిన టెన్నీ కాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకాలు సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్–14 విభాగంలో వీరు ఈ ఘనత సాధించారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కూడా అభినందించారు.

– నెల్లిమర్ల

ఫిజియోథెరపీ శిబిరం



నెల్లిమర్ల నగర పంచాయతీలోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని ఎంఈఓ సూర్యనారాయణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటువంటి శిబిరాల వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ కె.రాజమోహన్, సహిత విద్య ఉపాధ్యాయుడు బి. అప్పలనాయుడు, ఎ. పురుషోత్తంనాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

ఉచిత వైద్య శిబిరం ..



విజయనగరంలోని పేర్ల వారివీధిలో గల సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది డెఫ్ అండ్ బ్లైండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మహాజన్ రాయ్ సాహెబ్ పేర్ల రామమూర్తి చెట్టి చెవిటి పిల్లల పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 60 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డీవీ శ్రీకాంత్, ఈఎన్‌టీ వైద్యుడు కె.నాగమనోహర్, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి వై.విష్ణు, గౌరవాధ్యక్షుడు టి.అప్పారావు, కార్యదర్శి కేఆర్‌డీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

రీ సర్వేపై అవగాహన..



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అర్బన్ రీసర్వేపై సచివాలయ కార్యదర్శులకు సోమవారం అవగాహన కల్పించారు. కార్పొరేషన్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, సర్వేయర్ సింహాచలం ముందుగా ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్‌ను పరిశీలించారు. నగర పరిధిలో ఉన్న ఆస్తుల వివరాలు, భవనాలు, వాటికి విధించిన పన్నుల వివరాలను పొందుపరచాల్సి ఉంటుందని సూచించారు. టౌన్‌ప్లానింగ్, సచివాలయ రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో రీసర్వే సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

– విజయనగరం

లిఫ్ట్ ప్రమాదంలో కార్మికురాలు మృతి





లిఫ్ట్ ప్రమాదం జరిగిన ప్రదేశం

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఏపీటోరియా (అరబిందో) పెన్సిలిన్ ప్లాంట్‌లో క్యాంటీన్ కార్మికురాలు దోర రామలక్ష్మి (37) లిఫ్ట్ ప్రమాదంలో దుర్మరణం చెందింది. జె.ఆర్.పురం పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పెన్సిలిన్ ప్లాంట్ క్యాంటీన్ వద్ద లిఫ్ట్ కింద ప్రాంతంలో రామలక్ష్మి శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా పైనుంచి లిఫ్ట్ బాక్స్ కిందకు పడిపోయింది. అందులో రామలక్ష్మి ఇరుక్కుని తీవ్ర గాయాల పాలైంది. వెంటనే పరిశ్రమ అంబులెన్స్‌లో విజయనగరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఆమె అత్తవారు విజయనగరంలోని కోడగంటివారి వీధిలో ఉండగా.. ఉద్యోగ రీత్యా పైడిభీమవరంలోని తల్లి ఇంటి వద్దే ఉంటోంది. పన్నెండేళ్లుగా ఇక్కడే పనిచేస్తోంది. భర్త అప్పలరాజు విజయనగరంలో ఉంటున్నారు. ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారు. మృతురాలి సోదరుడు గోర అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

50 లక్షల పరిహారం చెల్లించాలి..

రామలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.50లక్షలు పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిశ్రమలో సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. పరామర్శలో విజయనగరం జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఏ.జగన్మోహన్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

నెల్లిమర్ల రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై గణేష్ సూచించారు. మండలంలోని కొత్తపేట, టొంపలపేట, సతివాడ గ్రామాల్లో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకులు మృత్యువాత పడుతున్నారన్నారు. తాజా నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువతే చనిపోతున్నారని చెప్పారు. మద్యం, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన 56 మందికి అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భక్తురాలి చీరకు అంటుకున్న దీపం

విజయనగరం క్రైమ్: శివాలయం ప్రాంగణంలో మహిళ చీరకు దీపం అంటుకోవడంతో వెంటనే భక్తులు, అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అప్రమత్తమై మంటలను ఆర్పి మహిళా భక్తురాలిని కాపాడారు. స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న శివాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానంతరం ఓ మహిళా భక్తురాలు దీపారాధన చేస్తుండగా చీర కొంగుకు దీపం అంటుకోవడంతో అక్కడే ఉన్న భక్తులు, కానిస్టేబుల్ స్పందించి మంటలను ఆర్పారు. అనంతరం ఆమెను ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. భక్తురాలిని కాపాడాని కానిస్టేబుల్ మణికంఠను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

అన్నదానానికి ఏర్పాట్లు పూర్తి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన భారీ అన్నదాన ప్రక్రియను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. భక్తులందరూ అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.